RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:68 | ఫిబ్రవరి 19, 2026 | వెల: రూ.3-00



## రహస్యంగా ప్రభుత్వ ఆస్తుల అమ్మకాలు

- బోరు మోటర్లు, పైపులు విక్రయంపై వివాదం
- ఎంపీడీవోకు ఫిర్యాదు చేసిన వార్డు సభ్యురాలు
- ఫిర్యాదుతో వస్తువులను తిరిగి తీసుకొచ్చిన కార్యదర్శి

2లో

## రూ.2 కోట్ల బీమా సొమ్ము కోసం..



### యువకుడిపై స్నేహితుల హత్యాయత్నం

- మద్యం తాగించి రాడ్‌తో తలపై దాడి..
- రహదారి పక్కన పడేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేలా ప్లాన్
- ఇద్దరు నిందితుల అరెస్ట్
- భద్రచలంలో ఘటన

2లో

### ఆర్థిక ఇబ్బందులతో
## బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

### కాలేజీ ఫీజులు చెల్లించలేక మూడు నెలలుగా ఇంటి వద్దే..

- తండ్రి మందలింపుతో మనస్తాపం..
- బోయినిపల్లి మండలంలో విషాదం



2లో

# చట్టం ఎవరికీ చుట్టం కాదు..!

## కోర్టు ధిక్కరణ కేసులో కలెక్టర్‌కు జైలు!

## 6 నెలలు శిక్ష విధించిన హైకోర్ట్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్ర పాలనా యంత్రాంగంలో అత్యున్నత స్థాయి అధికారిగా ఉన్న ఒక జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు జైలు శిక్ష విధించడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కోర్టు ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగా అమలు చేయలేదనే అభియోగంపై మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కు ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తెలంగాణ ఉన్నత న్యాయస్థానం సంచలన తీర్పునిచ్చింది.

మిగతా 2వ పేజీలో..



- ఆదేశాలను పట్టించుకోనందుకు సంచలన తీర్పు
- ఉన్నత హోదాలో ఉన్నవారు చట్టానికి అతీతులమని భావించకూడదు
- కీలక వ్యాఖ్యలు చేసిన ధర్మాసనం
- రాష్ట్ర అధికార వర్గాల్లో ఒక్కసారిగా కలకలం!



2లో



### హైదరాబాద్‌ను గ్రీన్, నెట్ జీరో సేవల హబ్‌గా
## అభివృద్ధి చేస్తాం

- క్యూర్ ప్రాంతాన్ని కాలుష్యరహిత కేంద్రంగా రూపుదిద్దుతాం
- తెలంగాణ రైజింగ్ దృష్టిలో ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం
- గ్రీన్ ఎనర్జీ, మౌలిక సదుపాయాల సమన్వయంతో అభివృద్ధి
- ముంబై క్లైమెట్ వీక్ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి

2లో

### రాజ్యసభ ఎన్నికల
## షెడ్యూల్ విడుదల

- దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు
- తెలంగాణలో రెండు స్థానాలు ఖాళీ.. కాంగ్రెస్‌కు దక్కే అవకాశాలే ఎక్కువ
- ఫిబ్రవరి 26న నోటిఫికేషన్.. మార్చి 5 వరకు నామినేషన్లు.. 16న పోలింగ్

2లో

### మంత్రి వివేక్ కాన్వాయ్‌పై దాడి కేసు..
## బాల్క సుమన్ అరెస్ట్



- క్యాతనపల్లిలో పోలీసుల అదుపులో మాజీ ఎమ్మెల్యే
- కార్యకర్తల నిరసనలతో ఉద్రిక్తత
- రామకృష్ణాపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

2లో

## బాల్క సుమన్‌ది అక్రమ అరెస్ట్
### బేషరతుగా విడుదల చేయాలి: కేటీఆర్



### అర్హులైన జర్నలిస్టులకు
## అక్రిడిటేషన్ కార్డులు జారీ

- ముద్రిత, ఎలక్ట్రానిక్, డిజిటల్ జర్నలిస్టులకు అవకాశం
- ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

2లో

### 'ధరణి' దోపిడీపై
## ఉక్కుపాదం మోపాలి



- స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీల అక్రమాలను వెలికితీయాలి
- భూభారతి పోర్టల్‌ను ప్రజలకనుకూలంగా రూపకల్పన చేశాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- వ్యవస్థాగత లోపాలపై ఉన్నత స్థాయి విచారణ

2లో

వేద న్యూస్

గురువారం | ఫిబ్రవరి 19, 2026

## హైదరాబాద్‌ను గ్రీన్, నెట్ జీరో సేవల హబ్‌గా

# అభివృద్ధి చేస్తాం

### ముంబై క్లైమెట్ వీక్ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్‌ను గ్రీన్, నెట్ జీరో సేవల కేంద్రంగా అభివృద్ధి చేసి సుస్థిర పట్టణాభివృద్ధిలో హైదరాబాద్‌ను దేశానికి నమూనాగా నిలబెడతామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. ముంబై క్లైమెట్ వీక్ సదస్సులో పాల్గొన్న ఆయన, వాతావరణ మార్పు నుంచి వాతావరణ అత్యవసర పరిస్థితికి ప్రపంచం చేరుకుందని పేర్కొంటూ తక్షణ చర్యలు అవసరమని పిలుపునిచ్చారు. తెలంగాణ రైజింగ్ దృష్టిలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను రెండు వందల బిలియన్ డాలర్ల స్థాయి నుంచి రెండు వేల ముప్పై నాలుగుకు ఒక ట్రిలియన్ డాలర్లకు, రెండు వేల నలభై ఏడు నాటికి మూడు ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లే లక్ష్యాన్ని వెల్లడించారు. నెట్ జీరో సాధన కోసం క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు జోన్ వ్యూహాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్ పరిధిని క్యూర్‌గా ప్రకటించి, కాలుష్య కారక పరిశ్రమలు లేకుండా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. ప్రధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు గ్రీన్ ఎనర్జీతో అనుసంధానం అవుతాయని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైలు, ఎక్స్‌ప్రెస్ మార్గాలు, డ్రై పోర్టులు, కొత్త విమానాశ్రయ సదుపాయాలు, భరత్ ఫ్యూచర్ సిటీ, మూసి రివర్ ఫ్రంట్, సరస్సుల పునరుద్ధరణ, వరద నియంత్రణ వంటి ప్రాజెక్టులు సుస్థిరతకు ప్రాధాన్యం ఇస్తాయని వివరించారు. రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ ముప్పై నాలుగు వేల మెగావాట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నామని, ఇందులో దాదాపు పావు వంతు గ్రీన్ ఎనర్జీ నుంచే వస్తోందని తెలిపారు.

## రూ.2 కోట్ల బీమా సొమ్ము కోసం..

### యువకుడిపై స్నేహితుల హత్యాయత్నం

**వేద న్యూస్, భద్రాద్రి కొత్తగూడెం**

జిల్లాలో బీమా సొమ్ము కోసం ఓ యువకుడిని హతమార్చి రోడ్డు ప్రమాదంగా చూపించేందుకు ప్రయత్నించిన ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రమాదంగా చిత్రీకరించిన ఈ ఘటన వెనుక కుట్ర ఉన్నట్టు పోలీసులు గుర్తించి ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఏపీలోని పోలవరం జిల్లా ఎటపాక మండలం గన్నవరానికి చెందిన కట్టా యశ్వంత్ చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి మేనమామ వద్ద పెరిగాడు. జీవనోపాధి కోసం కష్టపడుతున్న అతడికి భద్రాచలానికి చెందిన సాయిదీపక్‌తో ఆరు నెలల క్రితం పరిచయం ఏర్పడింది. ఈ పరిచయాన్ని ఆసరాగా తీసుకుని సాయిదీపక్ తన స్నేహితుడు భానుప్రకాష్‌తో కలిసి యశ్వంత్ పేరుతో రూ.2 కోట్ల బీమా పాలసీ తీసుకునే కుట్ర పన్నాడు. గత ఏడాది నవంబర్‌లో యశ్వంత్ పేరిట బీమా పాలసీ తీసుకుని, సాయిదీపక్‌ను నామినీగా చేర్చారు. అనంతరం యశ్వంత్‌ను హతమార్చి ప్రమాదంలా చూపించి బీమా సొమ్ము పొందాలని పథకం రచించారు. ఈ నెల 14న మోతె పట్టినగర్ సమీపంలో యశ్వంత్‌కు మద్యం తాగించి, ఇనుప రాడ్‌తో తలపై దాడి చేశారు. అనంతరం రహదారిపై పడేసి, పక్కనే స్కూటీ ఉంచి రోడ్డు ప్రమాదంలా సన్నివేశం సృష్టించారు. అయితే అక్కడుగా వెళ్తున్న ప్రయాణికులు గాయాలతో ఉన్న యశ్వంత్‌ను గుర్తించి అంబులెన్స్, పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆర్థిక ఇబ్బందులతో

# బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

**వేద న్యూస్, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం దుబ్బపల్లి గ్రామంలో కుటుంబ ఆర్థిక ఇబ్బందులు ఓ విద్యార్థి ప్రాణాన్ని బలితీసుకున్నాయి. ఉన్నత చదువులు పూర్తి చేసి కుటుంబానికి ఆసరాగా నిలవాల్సిన బీటెక్ విద్యార్థి, ఫీజులు చెల్లించలేని పరిస్థితుల్లో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రామంచ సంజయ్ (18) హైదరాబాద్‌లోని అవంతి కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండటంతో కాలేజీ ఫీజులు చెల్లించలేకపోయాడు. దీంతో గత మూడు నెలలుగా కాలేజీకి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఒకవైపు కాలేజీ ఫీజుల భారం, మరోవైపు కుటుంబ ఆర్థిక సమస్యలు, అక్క వివాహం వంటి పరిస్థితులు సంజయ్‌ను తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేశాయి. ఈ క్రమంలో బుధవారం ఉదయం సుమారు 7:30 గంటల సమయంలో తండ్రి రామంచ అశోక్ చిన్న విషయంపై మందలించాడని సమాచారం. ఇప్పటికే మానసిక ఒత్తిడిలో ఉన్న సంజయ్, ఆ మందలింపుతో మరింత మనస్తాపానికి లోనైనట్లు తెలుస్తోంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు టవల్‌తో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

## రహస్యంగా ప్రభుత్వ ఆస్తుల అమ్మకాలు

- బోరు మోటర్లు, పైపులు విక్రయంపై వివాదం
- ఎంపీడీవోకు ఫిర్యాదు చేసిన వార్డు సభ్యురాలు
- ఫిర్యాదు తర్వాత వస్తువులను తిరిగి తీసుకొచ్చిన కార్యదర్శి

**వేద న్యూస్, శంకరపట్నం**



శంకరపట్నం మండలం తాడికల్ గ్రామపంచాయతీలో ప్రభుత్వ ఆస్తులను రహస్యంగా విక్రయించిన ఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామపంచాయతీకి చెందిన పనికిరాని బోరు మోటర్లు, పైపులు వంటి ఇనుప వస్తువులను అనుమతి లేకుండా అమ్మినట్లు ఆరోపణలు వచ్చాయి. గ్రామపంచాయతీ ఆస్తులను విక్రయించాలంటే పాలకవర్గం తీర్మానం చేసి, డీపీఓ అనుమతితో టెండర్ ప్రక్రియ ద్వారా మాత్రమే విక్రయించాల్సి ఉంటుంది. అయితే ఈ నిబంధనలు పాటించకుండా విక్రయించారని ఓ వార్డు సభ్యురాలు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అనంతరం గ్రామ కార్యదర్శి అమ్మిన వస్తువులను తిరిగి తీసుకు వచ్చినట్లు సమాచారం. ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## చట్టం ఎవరికీ..

# చుట్టం కాదు!



- కోర్టు ధిక్కరణ కేసులో కలెక్టర్‌కు జైలు!
- 6 నెలలు శిక్ష విధించిన తెలంగాణ హైకోర్టు

మొదటి పేజీ తరువాయి

ఈ శిక్షతో పాటు 2వేల జరిమానా కూడా చెల్లించాలని ఆదేశించింది.

### అసలు ఏం జరిగిందంటే?

మెదక్ జిల్లా పరిధిలోని ఒక భూ వివాదంలో బాధితురాలు సుదీర్ఘకాలంగా న్యాయ పోరాటం చేస్తున్నారు. రెవెన్యూ రికార్డుల సవరణ లేదా భూమి హక్కులకు సంబంధించి గతంలోనే ఆమె హైకోర్టును ఆశ్రయించారు. ఆ సమయంలో కేసును విచారించిన న్యాయస్థానం, ఫిర్యాదుదారు భూమికి సంబంధించి విచారణ జరపాలని, వివాదంలో ఉన్న ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించింది. ముఖ్యంగా, ఈ ప్రక్రియ మొత్తాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కోర్టు స్పష్టమైన గడువు విధించింది. అయితే, నెలలు గడుస్తున్నా.. కలెక్టర్ కార్యాలయం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. బాధితురాలు పలుమార్లు కలెక్టరేట్ చుట్టూ తిరిగినప్పటికీ ఫలితం లేకపోవడంతో, ఆమె మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించి 'కోర్టు ధిక్కరణ' పిటిషన్ దాఖలు చేశారు.

### న్యాయస్థానం ఆగ్రహం.. కీలక వ్యాఖ్యలు

కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం, కలెక్టర్ వైఖరిపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. సాక్షాత్తూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఒక గడువు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసినా, ఒక జిల్లాకు బాధ్యుడిగా ఉన్న ఐఏఎస్ అధికారి నిర్లక్ష్యం వహించడాన్ని కోర్టు తప్పుబట్టింది. 'చట్టం ఎవరికీ చుట్టం కాదు' ఉన్నత హోదాలో ఉన్న అధికారులు తాము చట్టానికి అతీతులమని భావించకూడదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కోర్టు ఉత్తర్వులను అమలు చేయకపోవడం అంటే కేవలం కాలయాపన చేయడం మాత్రమే కాదు, అది న్యాయ వ్యవస్థను అవమానించడమేనని జస్టిస్ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. సామాన్యులకు న్యాయం జరగాల్సిన చోట అధికారులే అడ్డంకులుగా మారితే సహించేది లేదని స్పష్టం చేస్తూ, శిక్ష విధించడమే సరైన మార్గమని కోర్టు భావించింది.

### అప్పీలుకు అవకాశం ఉందా?

ప్రస్తుతానికి సింగిల్ బెంచ్ ఈ తీర్పును వెలువరించింది. చట్టప్రకారం, జిల్లా కలెక్టర్‌కు ఈ తీర్పుపై అప్పీలు చేసుకునే హక్కు ఉంటుంది. ఈ తీర్పును సవాలు చేస్తూ కలెక్టర్ హైకోర్టులోని డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించవచ్చు. అప్పీలు దాఖలు చేసిన సందర్భంలో, శిక్ష అమలుపై స్టే ఇచ్చే అవకాశం ఉంటుంది. తదుపరి విచారణలో కోర్టు ఆదేశాలను తక్షణం అమలు చేస్తానని హామీ ఇస్తూ, తగిన కారణాలను కోర్టుకు వివరించాల్సి ఉంటుంది.

### రాష్ట్ర అధికార వర్గాల్లో ప్రకంపనలు

సాధారణంగా ఇలాంటి కోర్టు ధిక్కరణ కేసుల్లో అధికారులు కోర్టుకు హాజరై బేషరతు క్షమాపణలు చెప్పడం లేదా గడువు కోరడం జరుగుతుంది. కానీ, ఈ కేసులో కోర్టు నేరుగా జైలు శిక్ష ఖరారు చేయడం ఐఏఎస్ వర్గాలను విస్మయానికి గురిచేసింది. ఇది ఇతర అధికారులకు కూడా ఒక హెచ్చరికగా నిలుస్తుందని న్యాయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

- దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు
- తెలంగాణలో రెండు స్థానాలు ఖాళీ.. కాంగ్రెస్‌కు దక్కే అవకాశాలే ఎక్కువ
- ఫిబ్రవరి 26న నోటిఫికేషన్.. మార్చి 5 వరకు నామినేషన్లు.. 16న పోలింగ్

భారత ఎన్నికల సంఘం రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా మొత్తం 10 రాష్ట్రాల్లో 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో తెలంగాణ నుంచి రెండు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 26న నోటిఫికేషన్ విడుదల కానుండగా, మార్చి 16న పోలింగ్ జరగనుంది. ప్రస్తుతం తెలంగాణ నుంచి రాజ్యసభలో ప్రాతినిధ్యం వహిస్తున్న బీఆర్ఎస్‌కు చెందిన కేఆర్ సురేష్ రెడ్డి, కాంగ్రెస్‌కు చెందిన అభిషేక్ మను సింఘ్వీ పదవీ కాలం ఏప్రిల్ 9తో ముగియనుంది. దీంతో ఈ రెండు స్థానాలతో పాటు దేశ వ్యాప్తంగా మరో 35 స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఈ ఎన్నికలకు సంబంధించి మార్చి 5 వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. మార్చి 6న నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) నిర్వహించనుండగా, మార్చి 9 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. మార్చి 16న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించి, అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతారు. మార్చి 20 నాటికి మొత్తం ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది. రాజ్యసభ ఎన్నికలు ఆయా రాష్ట్రాల అసెంబ్లీ సభ్యుల ఓట్ల ద్వారా నిర్వహించబడతాయి. తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్యేల సంఖ్యా బలం ఎక్కువగా ఉండటంతో ఖాళీ అయిన రెండు స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకునే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దేశవ్యాప్తంగా మహారాష్ట్రలో అత్యధికంగా 7 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో 6 చొప్పున, బిహార్‌లో 4, ఒడిశా, అస్సాంలో 3 చొప్పున, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లో రెండు చొప్పున, హర్యానా, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో ఒక్కొక్క స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. రాజ్యసభలో తమ బలం పెంచుకోవడానికి ఈ ఎన్నికలు కేంద్రంలోని అధికార ఎన్డీయేకు కీలకంగా మారనున్నాయి.

## మంత్రి వివేక్ కాన్వాయ్‌పై దాడి కేసు..

# బాల్క సుమన్ అరెస్ట్

**వేద న్యూస్, మంచిర్యాల**

తెలంగాణ రాష్ట్ర మంత్రి కాన్వాయ్‌పై దాడి కేసులో బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ను పోలీసులు అరెస్టు చేశారు. క్యాతనపల్లిలోని ఆయన నివాసానికి చేరుకున్న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు సమయంలో కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులు లాఠీచార్జ్ చేసి వారిని చెదరగొట్టారు. అరెస్టు అనంతరం బాల్క సుమన్‌ను మంచిర్యాల ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం రామగుండం తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు. మంత్రి కాన్వాయ్‌పై దాడికి సంబంధించి రామకృష్ణాపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కేసులో ఏ వన్‌గా బాల్క సుమన్, ఏ టూగా మూల రాజిరెడ్డి పేర్లను పేర్కొన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీకి మెజారిటీ స్థానాలు వచ్చినప్పటికీ, మున్సిపాలిటీని చేజిక్కించుకునేందుకు మంత్రి ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. ఈ పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్, సీపీఐ పార్టీలు కలిసి క్యాతనపల్లి బంద్‌కు పిలుపునిచ్చాయి. ప్రాంతంలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# బాల్క సుమన్‌ది అక్రమ అరెస్ట్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

### బేషరతుగా విడుదల చేయాలి

- క్యాతన్‌పల్లి మున్సిపాలిటీపై కుట్ర ఆరోపణ
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్



బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు తీవ్రస్థాయిలో స్పందించారు. ఇది పూర్తిగా అక్రమ అరెస్ట్ అని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని మండిపడ్డారు. మంచిర్యాల జిల్లాలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీని అడ్డదారుల్లో కైవసం చేసుకోవాలనే ఉద్దేశంతోనే ఈ కుట్రకు తెరలేపారని ఆరోపించారు. బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ కలిసి దౌర్జన్యంగా దాన్ని చేజిక్కించుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ కుట్రలో భాగంగానే సుమన్‌పై అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేయించారని పేర్కొన్నారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలకు వ్యతిరేకంగా క్యాతన్‌పల్లి ప్రజలు బంద్ పాటించినా ప్రభుత్వం స్పందించలేదని కేటీఆర్ అన్నారు. కొందరు పోలీసు అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తమ వైఖరి మార్చుకోకపోతే భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, అప్పటికి కాంగ్రెస్ నేతలు చేసిన చర్యలకు సమాధానం చెప్పాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. అక్రమ కేసులో అరెస్ట్ చేసిన బాల్క సుమన్‌ను ప్రభుత్వం తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని బీఆర్ఎస్ తరఫున డిమాండ్ చేశారు.

## 'ధరణి' దోపిడీపై ఉక్కుపాదం

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

ధరణి పోర్టల్ వ్యవహారంపై రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తీగ లాగితే డొంక కదిలినట్లుగా ధరణి వ్యవహారం ఉందని, ప్రజల ఆస్తుల రక్షణ కోసం రూపొందించిన వ్యవస్థను కొంతమంది స్వార్థ ప్రయోజనాలకు వాడుకున్నారని మండిపడ్డారు. సచివాలయంలో ఉన్నత స్థాయి కమిటీతో సమీక్ష నిర్వహించారు. ధరణి పోర్టల్‌లోని లోపాలను ఆసరాగా చేసుకుని స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీలను కొల్లగొట్టిన ఘటనపై ఉన్నత స్థాయి కమిటీ విచారణ జరిపిందని తెలిపారు. ఇది సాధారణ సాంకేతిక లోపం కాదని, వ్యవస్థాగతంగా సృష్టించిన లోపాల ఫలితమని స్పష్టం చేశారు. సెక్యూరిటీ ఆడిట్‌లో గుర్తించిన లోపాలను సరిదిద్దకుండానే నివేదిక ఇచ్చినట్టు ప్రాథమికంగా గుర్తించినట్లు వెల్లడించారు. భూముల లావాదేవీలకు సంబంధించిన అనుమానాస్పద సమాచారం లభించకుండా లాగిన్‌లను తొలగించిన అంశం, రహస్య లాగిన్ వివరాలు లేకపోవడం వంటి అంశాలు విచారణలో బయటపడ్డాయని పేర్కొన్నారు. ఫోరెన్సిక్ ఆడిట్‌లో కోడ్ ఆడిట్ నిర్వహించలేదని వెల్లడైందని, తక్షణమే ధరణి పోర్టల్‌పై కోడ్ ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విదేశీ సంస్థకు నిర్వహణ బాధ్యతలు అప్పగించడం వల్లే సమస్యలు తలెత్తినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రభుత్వానికి రావాల్సిన ప్రతి పైసాను వసూలు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. తప్పుచేసిన వారెవరైనా వదిలిపెట్టబోమని హెచ్చరించారు. భూభారతి పోర్టల్‌ను ప్రజలకు అనుకూలంగా, అధికారుల ప్రమేయానికి తావులేకుండా రూపొందించాలని అధికారులకు సూచించారు. సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో నిర్వహించిన విధంగానే మిగతా జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్ చేపట్టాలని ఆదేశించారు.

## అర్హులైన జర్నలిస్టులకు

# అక్రిడిటేషన్ కార్డులు జారీ

- ముద్రిత, ఎలక్ట్రానిక్, డిజిటల్ జర్నలిస్టులకు అవకాశం
- ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ జీవో సంఖ్య రెండు వందల యాభై రెండు ప్రకారం అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు సమాచార మరియు పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సి హెచ్ ప్రియాంక తెలిపారు. ముద్రిత, ఎలక్ట్రానిక్, డిజిటల్, ఫ్రీలాన్స్ మరియు వేటరన్ జర్నలిస్టులు ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి ప్రత్యేక పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. దరఖాస్తుల స్వీకరణ, కార్డుల జారీ ప్రక్రియ నిరంతర పద్ధతిలో కొనసాగుతుందని స్పష్టం చేశారు. దరఖాస్తు ప్రక్రియలో సాంకేతిక సమస్యలు ఎదురైతే కార్యాలయ వేళల్లో మీడియా రిలేషన్స్ విభాగాన్ని సంప్రదించాలని సూచించారు. ఉదయం పది గంటల ముప్పై నిమిషాల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సహాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రత్యేక కమిషనర్ పేర్కొన్నారు. పారదర్శక విధానంతో అక్రిడిటేషన్ ప్రక్రియను అమలు చేస్తామని తెలిపారు.

# హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం

- లారీ ఢీకొట్టడంతో వ్యక్తి మృతి



**వేద న్యూస్, నల్లబెల్లి:**

నల్లబెల్లి మండలం శనగరం గ్రామ శివారులోని నేషనల్ హైవే-365పై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. అర్వాయపల్లి గ్రామానికి చెందిన బసవరాజులు కుమార్ స్వామి (50) రోడ్డు దాటుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మల్లంపల్లి వైపు నుంచి అతివేగంగా వస్తున్న టీఎస్-03-యూబీ-0468 నంబర్ గల లారీ ఆయనను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కుమార్ స్వామి తలకు తీవ్ర గాయాలు కావడంతో ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్సై గోవర్ధన్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అతివేగం కారణంగా ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు హెచ్చరించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

# కరీంనగర్ కోర్టుకు బాంబు బెదిరింపు మెయిల్

- డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు
- ఫేక్ బెదిరింపుగా నిర్ధారణ‌ ‌సైబర్ క్రైమ్ దర్యాప్తు ప్రారంభం




**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు మెయిల్ రావడంతో బుధవారం తీవ్ర కలకలం రేగింది. మధ్యాహ్నం 12:30 గంటలకు కోర్టు ప్రాంగణంలో బాంబు పేలుతుందంటూ వచ్చిన మెయిల్‌ను కోర్టు ఏఓ గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని జడ్జికి తెలియజేయగా, కోర్టు లైజన్ ఆఫీసర్ ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న టూ టౌన్ సీఐ సృజన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ బృందాలతో కలిసి కోర్టు ఆవరణను పూర్తిగా జల్లెడ పట్టారు. ప్రతి గది, కోర్టు హాల్స్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదు. దీంతో ఇది కేవలం వట్టి బెదిరింపు (ఫేక్ మెయిల్) అని పోలీసులు నిర్ధారించారు. ఈ ఘటనతో కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, ప్రజలు కొంతసేపు భయాందోళనకు గురయ్యారు. అనంతరం పోలీసులు పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకువచ్చారు. బాంబు బెదిరింపు మెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది? దీని వెనుక ఎవరు ఉన్నారు? అనే కోణంలో సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. న్యాయస్థానాల వంటి అత్యంత భద్రత కలిగిన ప్రాంతాలకు ఇలాంటి బెదిరింపులు రావడం చర్చనీయాంశంగా మారింది.

# రహదారి శుభ్రత, వీధి దీపాల ఏర్పాటు

- గ్రామాభివృద్ధికి సర్పంచ్ సౌమ్య మహేష్ ప్రత్యేక చర్యలు

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిని పల్లి మండలం బూరుగుపల్లి గ్రామంలో గ్రామాభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. బూరుగుపల్లి గ్రామం నుంచి బోయినిపల్లి శివారు వరకు వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుం డా రహదారిపైకి వాలిన చెట్ల కొమ్మలను తొలగించే కార్య క్రమాన్ని చేపట్టారు. అదేవిధంగా గ్రామంలో వీధి దీపాల వెలుతురు సక్రమంగా అందేందుకు కొత్త విద్యుత్ స్థంభాలను ఏర్పాటు చేశారు. గ్రామంలో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చేందుకు సర్పంచ్ పెంచాల సౌమ్య మహేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీకాంత్, వార్డు సభ్యురాలు బరిగే రాధ రమేష్, గ్రామస్థులు, పెరుమండల్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను స్థానికులు అభినందించారు.

# నిబంధనల మేరకు అత్యధిక పరిహారం

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- సీతారామ ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతులతో చర్చ



**వేద న్యూస్, కారేపల్లి:**

సీతారామ ఎత్తిపోతల పథకం నిమిత్తం భూ సేకరణకు ప్రభుత్వం నిబంధనల మేరకు అత్యధిక పరిహారం మంజూరు చేసి, భూ నిర్వాసిత రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో సింగరేణి మండలం బాజు మల్లాయిగూడెం, రేలకాయపల్లి గ్రామాలకు చెందిన భూ నిర్వాసిత రైతులతో కలెక్టర్ సమావేశమయ్యారు. సీతారామ ఎత్తిపోతల పథకం 13వ ప్యాకేజీ నిర్మాణంలో భాగంగా భూ సేకరణ చేపట్టాల్సి ఉండగా, భూ సర్వే నిర్వహించి అవార్డులు ప్రకటించినట్లు తెలిపారు. రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణం ద్వారా సాగునీరు అందడంతో పాటు, ఆ ప్రాంత భూములు సారవంతం అవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవసాయ పంపుసెట్లు, చెట్లు, సుబాబుల్ చెట్లు, ఇతర నిర్మాణాలకు ప్రత్యేకంగా పరిహారం అందించినట్లు తెలిపారు. సుబాబుల్ చెట్లకు అటవీ శాఖ ద్వారా అంచనాలు చేయించి పరిహారం చెల్లించినట్లు చెప్పారు. రైతుల అభ్యర్థన మేరకు అటవీ శాఖ అధికారులతో మరోసారి పరిశీలనలు చేపట్టి, అవసరమైన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ నిబంధనల మేరకు గరిష్ట పరిహారం అందజేసినందున భూ నిర్వాసిత రైతులందరూ భూ సేకరణకు సహకరించాలని, ప్రాజెక్టు పనులకు ఆటంకం కలిగించవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎస్‌డీసీ ఎం. రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, ఇరిగేషన్ ఈఈ కె. బాబూరావు, డీఈ ఎస్. కిషోర్, సింగరేణి మండల తహసీల్దార్ ఆనంతుల రమేష్, భూ నిర్వాసిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కనీస వేతనాలు రూ.26 వేలకు పెంచాలి



- కేంద్ర అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌కు సిఐటియు వినతి

**వేద న్యూస్, జ్యోతి నగర్ :**

కేంద్ర ప్రభుత్వం కనీస వేతనాలను రూ.26 వేలకు సవరించాలని సెంట్రల్ ఆఫ్ ఇండియా ట్రేడ్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కేంద్ర అసిస్టెంట్ లేబర్ కమిషనర్ (సెంట్రల్)కు సిఐటియు తెలంగాణ రాష్ట్ర కమిటీ తరఫున వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బలుగూరి మధు మాట్లాడుతూ, 2017 జనవరి 19న కనీస వేతన చట్టం1948 ప్రకారం కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ, ఐదు సంవత్సరాలకు ఒకసారి జరగాల్సిన వేతన సవరణ ఇప్పటివరకు అమలు కాలేదన్నారు. గడువు ముగిసి నాలుగేళ్లు దాటినా వేతనాలు పెరగకపోవడం కార్మికులకు భారంగా మారిందని తెలిపారు.ప్రస్తుతం వేరియబుల్ డిఏ (వీడీఏ) బేసిక్‌లో 50 శాతానికి మించి ఉన్నప్పటికీ, మార్కెట్లో పెరుగుతున్న ధరలను అది ప్రతిబింబించడం లేదన్నారు. ప్రస్తుత కనీస వేతనాలతో కార్మికుల కుటుంబాలు జీవనం సాగించడం కష్టమైందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల కనీస అవసరాలు కూడా తీర్చలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. డాక్టర్ అక్రాయిడ్ ఫార్ములా, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలు రూ.26 వేల కంటే తక్కువ కాకుండా నిర్ణయించాలని, వెంటనే సవరణ చేపట్టాలని లేబర్ డిపార్ట్‌మెంట్ ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్. బిక్షపతి, ఎం.రామాచారి, ఎండి. యాకుబ్, జి.లక్ష్మారెడ్డి, వి. కిషోర్, టి. జగదీశ్వర్, అశోక్ రాజు, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

# పవర్ ప్లాంట్‌లో సేవాలాల్ జయంతి

**వేద న్యూస్, దామరచర్ల:**



దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఉద్యోగుల సంక్షేమ సం ఘం ఆధ్వర్యంలో బుధవారం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించి భోగ్ బండార్ కార్యక్రమంలో పాల్గొ న్నారు. అనంతరం వైటీపీఎస్ ఉద్యోగుల సంక్షేమ సంఘం క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రావణి నాగు నాయక్, ఉద్యోగులు, గిరిజన నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఫుట్‌బాల్ పోటీలకు మహర్షి విద్యార్థినులు ఎంపిక

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



జిల్లా కేంద్రంలోని గోపాల్ నగర్ లో ఉన్న మహర్షి హైస్కూల్ విద్యార్థినులు క్రీడారంగంలో ప్రతి భ చాటి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల కు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి అండర్-16 బాలికల ఫుట్ బాల్ పోటీలలో అద్భుత ఆటతీరు ప్రదర్శించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అర్హత సాధించారు. పాఠశాలకు చెందిన విద్యార్థినులు సుకృత, శ్రీనిక, హాసిని, ఉపాసనలు మైదానంలో పట్టుదలతో ఆడి జిల్లా జట్టులో స్థానం సంపాదించారు. రాష్ట్రస్థాయిలో కూడా తమ ప్రతిభను చాటి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని పాఠశాల యాజమాన్యం ఆకాంక్షించింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బూర శ్రీనివాస్, ప్రిన్సిపాల్ శ్వేత విద్యార్థినులను అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థినుల విజయానికి సహకరించిన వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బందిని కూడా ఈ సందర్భంగా అభినందించారు.

# మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుధా బాలకృష్ణకు సన్మానం

**వేద న్యూస్, దామరచర్ల:**



మిర్యాలగూడ నూతన మున్సిపల్ ఛైర్‌పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణను పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా 14వ వార్డు కౌన్సిలర్ వద్దేపల్లి శ్రీనివాస్‌ను కూడా సత్కరించారు. పద్మశాలి వర్గానికి చెందిన మహిళకు ఛైర్‌పర్సన్ పదవి కల్పించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి పద్మశాలి సంఘం సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ సుధా బాలకృష్ణ మాట్లాడుతూ.. మిర్యాలగూడ పట్టణాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు జెల్లా రాంబాబు, బావండ్ల పాండు, డాక్టర్ గుండు అంజయ్య, డాక్టర్ మిర్యాల కృష్ణయ్య, డాక్టర్ మనోహర్, అక్షిత, క్యామా వెంకటేశం, యర్రమాద దుర్గమ్మ, రాపోలు వెంకటేశ్వర్లు, బొల్లా లక్ష్మీనారాయణ, రావిరాల నాగేందర్, కోడి జనార్దన్, మాజీ కౌన్సిలర్ చిలుకూరి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# దాతృత్వానికి మారుపేరు 'మిర్యాల' సోదరులు

- విద్యార్థులకు ప్యాడులు, పెన్నులు, పాఠశాలకు మైక్ సెట్ పంపిణీ




**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

వేములపల్లి మండలం ఆమనగల్ గ్రామ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి మిర్యాల సోదరులు రామ్మూర్తి, సుధాకర్, వెంకటేశ్వర్లు ముందుకు వచ్చారు. పదవ తరగతి విద్యార్థులకు ప్యాడులు, పెన్నులు, పాఠశాలకు మైక్ సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పిల్లల సందీప్ మాట్లాడుతూ మిర్యాల సోదరులు దాతృత్వానికి మారుపేరుగా నిలిచారని, గ్రామాభివృద్ధికి వారు అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. లయన్స్ క్లబ్ చైర్మన్ మిర్యాల సుధాకర్ మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సహకరించడం ఆనందంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శాలెం రాజు, ప్రధానోపాధ్యాయులు యోగీశ్వర్, లయన్స్ క్లబ్ సభ్యులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# ఎలుగుబంటి వేషంలో సర్పంచ్

- కోతుల బెడద నివారణకు వినూత్న ప్రయత్నం



**వేద న్యూస్, ముస్తాబాద్:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలో కోతుల బెడద నివారణకు సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ శ్రీనివాస్ వినూత్న ప్రయత్నం చేశారు. ఎలుగుబంటి వేషధారణలో ఉన్న వ్యక్తిని గ్రామంలో తిరిగిస్తూ కోతులను తరిమేందుకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, వార్డు సభ్యులు, ఎన్‌ఆర్‌ఐ సెల్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్ తదితరులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో కోతులు ఇళ్లలోకి ప్రవేశించి కూరగాయలు, ఆహార పదార్థాలు తీసుకెళ్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని తెలిపారు. కోతుల బెడద నివారణకు ఎలుగుబంటి వేషధారణతో ఇది ఒక చిన్న ప్రయత్నమని, అవసరమైతే మరిన్ని చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

# విద్యుత్ స్తంభాలను ఢీకొట్టిన కారు

- మద్యం మత్తులో డ్రైవర్, కారులో మద్యం సీసాలు



**వేద న్యూస్, కోనరావుపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మర్రిమడ్ల గ్రామంలో మద్యం మత్తులో ఓ కారు డ్రైవర్ సృష్టించిన బీభత్సం స్థానికులను ఉలిక్కిపడేలా చేసింది. మర్రిమడ్ల చర్చి సమీపంలో అతివేగంగా దూసుకొచ్చిన కారు ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యుత్ స్తంభాలు దెబ్బతినగా, వైర్లు తెగిపడి తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. కారులో ఉన్న డ్రైవర్ మద్యం మత్తులో తూలుతూ కనిపించడంతో పాటు, కారులో పెద్ద ఎత్తున మద్యం సీసాలు లభ్యమయ్యాయి. చర్చి సమీపంలో నిత్యం భక్తులు, ప్రజల రాకపోకలు ఉండే ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. మద్యం మత్తులో నిర్లక్ష్యంగా వాహనం నడిపి ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టిన డ్రైవర్‌పై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# పరిశ్రమల అభివృద్ధికి జెడ్ సర్టిఫికేషన్ కీలకం

- డీఐసీ జీఎం హనుమంతు
- తంగళ్లపల్లిలో జెడ్ సర్టిఫికేషన్‌పై అవగాహన కార్యక్రమం

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే జెడ్ సర్టిఫికేషన్ ఎంతో అవసరమని రాజన్న సిరిసిల్ల జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ టి. హనుమంతు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రాంప్ ప్రాజెక్ట్ కింద జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో తంగళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలోని జిల్లా సమాఖ్య మీటింగ్ హాలులో జెడ్ సర్టిఫికేషన్‌పై ఒక రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీఎం హనుమంతు మాట్లాడుతూ.. జీరో డిఫెక్ట్ - జీరో ఎఫెక్ట్ నినాదంతో నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేస్తూ, పర్యావరణానికి హాని కలగకుండా పరిశ్రమలను నిర్వహించడం ద్వారా వ్యాపారవేత్తలు మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. అతిథి అధ్యాపకులుగా పాల్గొన్న జెడ్ ఫెసిలిటేటర్ బి. విజయ్‌కుమార్, చార్టెడ్ అకౌంటెంట్ టి. అంజనేయులు జెడ్ సర్టిఫికేషన్




ప్రాముఖ్యతను వివరించారు. ఈ సర్టిఫికేషన్ ద్వారా పరిశ్రమలకు కలిగే ప్రయోజనాలు, ఉత్పత్తుల నాణ్యత మెరుగుదల, మార్కెట్ అవకాశాల విస్తరణ, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న రైస్ మిల్లర్లు, వివిధ రంగాలకు చెందిన వ్యాపారవేత్తలు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమాన్ని ఈడీసీ మేనేజర్ కె. జయంత్, అసిస్టెంట్ మేనేజర్ టి. వెంకటశివసాయి సమన్వయం చేసి విజయవంతంగా నిర్వహించారు.

# గిరిజన సంస్కృతుల పరిరక్షణ అత్యవసరం



**వేద న్యూస్, హైదరాబాద్:**

- వీసీ ఆచార్య సూర్యా ధనంజయ్
- సిటీ కళాశాలలో సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

భారతదేశంలోని ప్రాచీన గిరిజన భాషలు, సంస్కృతులను పరిరక్షించుకోవడం అత్యవసరమని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సూర్యా ధనంజయ్ పేర్కొన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాలలో నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె ఈ సందర్భంగా మాట్లాడారు. బంజారాల ఆచార వ్యవహారాలు విశిష్టమైనవని, తెలంగాణలో బంజారాలు, కోస్తా ఆంధ్రాలో లంబాడీలు, రాయలసీమలో సుగాలీలు అనే పేర్లతో పిలుస్తారని తెలిపారు. బంజారా భాష తనకు ప్రాణసమానమని, గిరిజన విద్యార్థులు ఉన్నత విద్య సాధించి దేశ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా గిరిజన మహిళలు విద్యపై దృష్టి సారిస్తే సమాజ ప్రగతి వేగవంతమవుతుందని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి. హెచ్. ప్రసాద్ మాట్లాడుతూ వివిధ వర్గాల చరిత్ర, సంస్కృతులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండటం అవసరమని పేర్కొన్నారు. బంజారాల సంస్కృతి, జీవనశైలి ప్రత్యేకతను ప్రతిబింబించే విధంగా జయంతి వేడుకలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథి భోజు మహారాజ్ మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ బోధించిన సమానత్వం, నైతిక విలువలను విద్యార్థులు ఆచరించాలని సూచించారు. జానపద గాయకుడు కళాశ్రీ డా. భిక్షునాయక్ బంజారా గీతాలు ఆలపించి విద్యార్థులను అలరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డా. విప్లవ దత్ శుక్లా, డా. శాంతి, డా. శంకర్ కుమార్, డా. తిరుపతి, అధ్యాపకులు డా. సుజాతా అజ్మీరా, కె.పి. నాయక్, కృష్ణ యాదవ్, గాయకులు సుజాశ్రీ, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సిటీ కాలేజీలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- 20 వరకు దరఖాస్తుల స్వీకరణ.. 21న ఇంటర్వ్యూలు

**వేద న్యూస్, హైదరాబాద్:**

ప్రభుత్వ సిటీ కాలేజ్ (ఆటానమస్), హైదరాబాద్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొ. సి. హెచ్. ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కామర్స్ విభాగంలో ఒక పోస్టు, మేనేజ్‌మెంట్ విభాగంలో ఒక పోస్టు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత విషయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో కనీసం 55 శాతం మార్కులు ఉండాలని, నెట్/సెట్ లేదా పిహెచ్‌డీ అర్హత ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ ఫిబ్రవరి 20, 2026 కాగా, షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఫిబ్రవరి 21న ఉదయం 10.30 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. మరిన్ని వివరాలకు కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

# నూతన ప్రజాప్రతినిధులతో వాత్సల్య బ్లడ్ ఫౌండేషన్ భేటీ

- రక్తదాన కార్యక్రమాలకు సహకరించాలని విజ్ఞప్తి
- చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు శుభాకాంక్షలు

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లను వాత్సల్య బ్లడ్ ఫౌండేషన్ జిల్లా బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జిందం కళా చక్రపాణి, వైస్ చైర్మన్ దార్ల సందీప్, కౌన్సిలర్లు కల్లూరి రేణుక రాజన్న, ఆడెపు చంద్రకళ ప్రభాకర్, ఊరకొండ లక్ష్మిరాజు, బొల్లం వైష్ణవి నాగరాజులకు శుభాకాంక్షలు తెలిపారు. ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్త అవసరాన్ని తీర్చేందుకు వాత్సల్య బ్లడ్ ఫౌండేషన్ ఉచిత రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ సేవలు అందిస్తున్నదని తెలిపారు. భవిష్యత్తులో నిర్వహించనున్న రక్తదాన కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు సహకరించి యువతను రక్తదానానికి ప్రోత్సహించాలని




విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా అధినేత ఆకారపు సుధాకర్, ఉపాధ్యక్షులు లింగంపెల్లి ప్రేమ్ కుమార్, కార్యదర్శి జింక శేఖర్, సలహాదారుడు గొల్లపెల్లి మహిపాల్, సభ్యులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య

- ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందిన మహిళ

**వేద న్యూస్, వేములవాడ:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణానికి చెందిన వెంగళ దివ్య అలియాస్ రోహిణి (32) అనే వివాహిత బుధవారం ఉదయం తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కథలాపూర్ మండలానికి చెందిన బొంగు రాజా గంగు కుమార్తె దివ్యకు వేములవాడకు చెందిన దినేష్‌తో సుమారు పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఎనిమిది సంవత్సరాలు, ఐదు సంవత్సరాల వయస్సు గల ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత కొంతకాలంగా దివ్య తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మనసా పానికి గురైనట్లు సమాచారం. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున సుమారు 6 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ప్రాణాలు విడిచింది.



మృతురాలి తల్లి రాజా గంగు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వేములవాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్ తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వెల్లడించారు. అనారోగ్య బాధలు తట్టుకోలేకనే తన కుమార్తె ఈ చర్యకు పాల్పడిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# ప్రజల ఇబ్బందులకు తక్షణ స్పందన

- రోడ్డు మరమ్మతులు చేపట్టించిన జిల్లా చైర్మన్ మహమ్మద్ లాలా
- గొల్లపల్లి బస్టాండ్ వద్ద సమస్యకు పరిష్కారం



**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి బస్టాండ్ సమీపంలో రోడ్డు గుంతల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సివిల్ ప్రొటెక్షన్ లీగల్ సర్వీస్ జిల్లా చైర్మన్ మహమ్మద్ లాలా వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టించారు. ఈ విషయమై ఆర్అండ్బీ అధికారులతో మాట్లాడి సమస్యను వివరించడంతో పాటు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి గొల్లపల్లి నుంచి సముద్ర లింగాపూర్ వరకు రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించి పూర్తి చేశారు. మహమ్మద్ లాలా స్వయంగా పనులను పర్యవేక్షిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించడం తన బాధ్యతగా భావిస్తున్నానని, ప్రజలకు సేవ చేయడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. రోడ్డు మరమ్మతులు చేపట్టించినందుకు స్థానిక ప్రజలు మహమ్మద్ లాలాకు కృతజ్ఞతలు తెలిపారు.

# అభివృద్ధి చేస్తే అడ్రస్ ఎందుకు గల్లంతాయే ..!?

**వేద న్యూస్, వర్ధన్నపేట :**

సంక్షేమం..ఉద్యోగాల పేర నమ్మించి 10 ఏండ్లు అధికారం ఎలగబెట్టిన అరూరి రమేష్ నియోజకవర్గంలో ఎలగబెట్టిందెందో ప్రజలకు చెప్పకుని ఆశిర్వాదం పొందే సత్తా లేక నిత్యం ప్రజల మధ్య సామాన్యుల ఇంటి బిడ్డగా గడగడపకు సంక్షేమ పథకాలను తీసుకెళుతున్న ప్రజా నాయకుడు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుపై వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని యువజన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్, వర్ధన్నపేట యువజన కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కుల్ల యాకాంతం మండిపడ్డారు. మంగళ ‍వారం ఎమ్మెల్యే నాగరాజుపై మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ చేసిన వ్యాఖ్యలపై కుల్ల యాకాంతం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటనలో యాకాంతం మాట్లాడు తూ ఇంత చేశాం అంత చేశాం అని మీడియా ముందు గప్పాలు కొట్టడం అరూరి రమేష్ కు వెన్నతో పెట్టిన విద్యే అయినా మీ విద్యను ఇంకా వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలు నమ్మేందుకు సిద్ధంగా లేరని అన్నారు. ఇంకా మాటల గారడి ప్రదర్శించి అక్రమ సొమ్మును వెదజల్లి అధికారాన్ని పొందాలని చూస్తే రాజకీయంగా ఇంకా పాతాలానికి తొక్కేందుకు వర్ధన్నపేట ప్రజలు, కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉంటుందనే విషయాన్ని మరిచిపోవద్దని యాకాంతం హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ, నియోజ కవర్గ ఎమ్మెల్యే నాగరాజు రెండేళ్ల పాలనలో నియోజక వర్గంలో ఏం చేశారని అరూరి రమేష్ మాట్లాడడానికి సిగ్గుండాలని కళ్లముందే సామాన్యుల సంక్షేమం కనబడు తున్నా బీ.ఆర్.ఎస్ పార్టీని వచ్చిన ప్రతి ఎన్నికల్లో బొందబెడుతున్నా



ఇంకా దిగజారుడు వ్యాఖ్యలు చేయడం వారి కుట్ర రాజకీయాలకు చక్కని ఉదాహరణగా కనిపిస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజక వర్గంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఎన్నికల్లో ఇచ్చిన ఒక్కో హామీని నేరవేరుస్తూ వస్తున్న క్రమంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు వచ్చిన ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని నిండు మనసుతో ఆశీర్వదిస్తూ ప్రజాపాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నప్పటికి బీఆర్ఎస్ నాయకులు కళ్లున్న గుడ్డివాళ్లలా వ్యవహరించడం వారి రాజకీయ మరుగుజ్జుతనానికి నిద ర్శనమన్నారు. నియోజకవర్గంలో సామాన్యులకు అవసరమైన రేషన్ కార్డులు అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదే ఇచ్చి సామాన్యుల కడుపు నింపేలా 3 కోట్ల మందికి పైగా సన్నబియ్యం పంపిణీ చేస్తూ చరిత్ర తిరగాసిందన్నారు. అంతేగాక సామాన్యుల చిరకాల కోరిక అయిన డబుల్ బెడ్రూం పక్కా ఇళ్లను ఏలాంటి బేషజాలు లేకుండా ప్రతి నియోజకవర్గానికి 3 వేల ఇండ్లను మంజూరు చేసి బిల్లులు

- కుల్ల యాకాంతం

సక్రమంగా అందిస్తూ ఇళ్ల నిర్మాణాలను సాఫీగా సాగిస్తున్న విషయాన్ని అరూరి తెలుసుకోవాలన్నారు. 10 ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గంలో సంక్షేమమే చేసినట్లైతే అరూరి రమేష్ దమ్ముంటే ఎంతమంది బీదలకు డబుల్ బెడ్రూం ఇళ్లను ఇచ్చారో -చెప్పాలని యాకాంతం ఎద్దేవా చేశారు. వివాహమై ఏండ్లు గడిచిన సామాన్యులకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వని అరూరి బీదలకు సంక్షేమం చేశానని చెప్పుకోవడం ఆయన నీతిమాలిన రాజకీయాలకు నిదర్శమని అన్నారు. అడ్డగోలు మాటలు చెప్పి అధికారం 10 ఏండ్లు చేలాయించిన అరూరి రమేష్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పేర వ్యాపారం చేసింది నిజం కాదా..? ఎమ్మెల్యే ముసుగులో వ్యాపారం చేస్తూ భూ దందాలు, కష్టాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలను సాగించి వందల కోట్ల రూపాయల అక్రమంగా సంపాదించింది. నిజం కాదా..? ప్రజలకు సేవ చేసే నాయకుడు ప్రజల్లో ఉండాలే తప్ప మండలానికో ఫాం హౌజ్ కట్టుకుని అందులో రాజకీయ సెటిల్ మెంట్లు చేయడమే గాక ఎన్నికల ముందు ఇంటింటికి తిరిగి చెక్కులు పంపిణీ చేసే ఆరూరి రమేష్ ఎన్నికలు ఆయ్యాక ఫాంహౌజ్లకు పిలిచి నీ వక్రబుద్ధి చూపింది గాక ఇంకా ప్రజల కోసమే ఫాం హౌజ్లు కట్టుకున్నానని చెప్పడానికి సిగ్గు లేదా అని యాకాంతం ఆగ్రహం వ్యక్తం చేశారు. అరూరి రమేష్ ఇప్పటికైనా ప్రజల నాడిని తెలుసుకుని నీ రాజకీయాలు, నీ పార్టీ రాజకీయాలు చేసుకోకుండా కాంగ్రెస్ పార్టీ, ఎమ్మెల్యే నాగరాజు పై పిచ్చి మాటలు మాట్లాడితే నియోజక వర్గంలో కనీసం తిరగకుండా ప్రజలే తిరగబడడం ఖాయం, తగిన బుద్ధి చెప్పడం తథ్యం అని యాకాంతం హెచ్చరించారు.

వేద న్యూస్



# హామీలు నెరవేర్చే వరకు జాగృతి పోరాటం

- బలోపేతానికి గ్రామ స్థాయి నుంచి కమిటీలు
- రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లకవాత్ రూప్‌సింగ్

**వేద న్యూస్, కరీంనగర్:**



కరీంనగర్ పట్టణంలోని జాగృతి కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అధ్యక్షతన జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లకవాత్ రూప్‌సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రూప్‌సింగ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు జాగృతి ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. రానున్న జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల్లో జాగృతి తన సత్తా చాటుతుందని తెలిపారు. జిల్లాలో జాగృతిని గ్రామ స్థాయి వరకు బలోపేతం చేసేందుకు నాయకులు కృషి చేయాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో జాగృతి బలోపేతానికి అన్ని స్థాయిలలో కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం, కాల్వల మరమ్మత్తులు చేపట్టడం, ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించడం వంటి అంశాలపై త్వరలోనే ప్రభుత్వంపై ఉద్యమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అక్కం శివరాణి, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, ఆదివాసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హాల్ టికెట్లు ఇవ్వని కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

- ఇంటర్మీడియట్ విద్యాధికారికి ఎస్ఎఫ్ఐ వినతి పత్రం

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లా భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో హాల్ టికెట్లు ఇవ్వని ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలు సమీపిస్తున్న వేళ కొన్ని ప్రైవేటు కళాశాలలు ఫీజుల పేరుతో విద్యార్థులను వేధిస్తూ హాల్ టికెట్లు ఇవ్వకుండా భయాందోళనకు గురిచేస్తున్నాయని తెలిపారు. వెంటనే అలాంటి కళాశాలలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి విద్యార్థికి హాల్ టికెట్ అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా పరీక్షా కేంద్రాల్లో త్రాగునీరు, విశాలమైన గదులు, ఫ్యాన్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జాలపల్లి మనోజ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు కదారి శివ, నాయకులు రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ సత్య శారద

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**




ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వ హణ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై బుధవారం అదనపు కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ నుండి నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షల పరీక్షా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో 26 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించబడుతాయని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రథమ సంవత్సరం . జనరల్ 5210, ఒకేషనల్ 793 మొత్తం 6003 విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం జనరల్ 5356, ఒకేషనల్ 807 మంది మొత్తం 6163 విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షల పర్యవేక్షణకు గాను జిల్లా పరీక్షల కమిటీ, ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్, 26 మంది ఛీఫ్ సూపరింటెండెంట్లు, 26 మంది డిపార్ట్ మెంటల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. 26 పరీక్షా కేంద్రాల్లో వైద్య సిబ్బంది, బందోబస్తుకు సైతం ఏర్పాట్లు, వార్షిక పరీక్షలకు గాను అన్ని పరీక్షా కేంద్రాల్లోని గదుల్లో డ్యుయల్ డెస్కులు, గాలి, నీరు, విద్యుత్, ఫ్యాన్లు, నీటి వసతి మరియు సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వాహనాల రాకపోకలకు, ప్రశ్నాపత్రాలు, సమాధాన పత్రాల స్టోరేజ్ కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే టోల్ ఫ్రీ నెం. 9240205555 నెంబరును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సవేశంలో జిల్లా రెవెన్యూ అధికారు విజయ లక్ష్మీ , జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి శ్రీధర్ సుమన్,వైద్య ఆరోగ్య, ఎలక్ట్రిసిటీ, రెవెన్యూ, పోస్టల్, ఇంటర్మీడియట్ విద్య, ఆర్టీసీ, సంబంధిత శాఖల తదితరులు పాల్గొన్నారు.

# నెలవంక దర్శనం..

- ప్రారంభమైన రంజాన్ ఉపవాస దీక్షలు

**వేద న్యూస్, రుద్రూర్:**



ఆకాశంలో బుధవారం నెలవంక దర్శనమివ్వడంతో గురువారం నుంచి రంజాన్ మాస ఉపవాస దీక్షలు ప్రారంభమైనట్లు రుద్రూర్ మండల ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, అక్బర్ నగర్ మసీదు సదర్ షేక్ మొహమ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా మసీదులు ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమయ్యాయి. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు నెలరోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు ఆచరిస్తారు. వేకువ జామున తీసుకునే ఆహారాన్ని 'సహార్'గా పిలుస్తారు. అనంతరం సూర్యాస్తమయం వరకు ఆహారం, నీరు తీసుకోకుండా ఉపవాసం కొనసాగిస్తారు. సాయంత్రం ఖర్జూరంతో ఉపవాస విరమణ చేయడాన్ని 'ఇఫ్తార్'గా పేర్కొంటారు. రంజాన్ మాసంలో ప్రత్యేకంగా నమాజ్‌లు నిర్వహించడంతో పాటు, రాత్రి ఇషా నమాజ్ అనంతరం తరావీహ్ నమాజ్‌లు కూడా నిర్వహిస్తారు. ఈ పవిత్ర మాసం సమతా, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని ముస్లిం మత పెద్దలు తెలిపారు.

# యూరియా కొరతపై రైతుల ఆందోళన

- ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణాలపై అక్రమాల ఆరోపణలు
- రైతు వేదిక ఎదుట బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల ధర్నా

**వేద న్యూస్, దామరచర్ల:**




దామరచర్ల మండలంలో యూరియా కొరతపై బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల ఆధ్వర్యంలో రైతులు బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక ముందు ధర్నా నిర్వహించారు. ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణాలు యూరియాను ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా పక్కదారి పట్టిస్తున్నాయని ఆరోపించారు. ఈ సందర్భంగా బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్య యాదవ్ మాట్లాడుతూ మండలంలో కృత్రిమ యూరియా కొరత సృష్టించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. పీఏసీఎస్, ఆగ్రో సెంటర్లలో యూరియా వచ్చినప్పుడు మాత్రమే రైతులకు సమాచారం ఇస్తున్నారని, ప్రైవేటు దుకాణాల్లో వచ్చిన యూరియాను ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని ఆరోపించారు. ఒక్కో యూరియా బస్తాను రూ.500 నుంచి రూ.1000 వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని, ఇందులో అధికారుల ప్రమేయం కూడా ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందాల శంబయ్య మాదిగ, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు గుగులోతు శారద నాయక్, రైతులు మరియు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

- రైతుకు రూ.40 వేల చెక్కును అందించిన సెస్ వైస్ చైర్మన్

**వేద న్యూస్, కోనరావుపేట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కొలనూర్ గ్రామానికి చెందిన రైతు బుర్ర రవీందర్ గౌడ్‌కు చెందిన ఆవు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడంతో సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి రూ.40 వేల పరిహారం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా రైతుకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా నష్టాన్ని కొంతవరకు భర్తీ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొలనూర్ సర్పంచ్ సంకినేని అరవింద్ రావు, ఉప సర్పంచ్ బిట్ల బాబు, సెస్ ఏఈఈ, లైన్ ఇన్‌స్పెక్టర్, మాజీ సర్పంచ్ జవ్వాజి తిరుపతి గౌడ్, మామిండ్ల అంజయ్య, రైతులు పాల్గొన్నారు.

# చెక్‌డ్యామ్‌ల వద్ద ఇసుక తవ్వకాలు వద్దు




- 300 మీటర్ల పరిధిలో తవ్వకాలు పూర్తిగా నిషేధం
- కలెక్టర్ పమేలా సత్పతి
- ఇసుక రీచ్‌లపై కట్టుదిట్టమైన పర్యవేక్షణకు ఆదేశాలు

**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగింది. సమావేశానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నదులపై నిర్మించిన చెక్‌డ్యామ్‌ల వద్ద భద్రతా దృష్ట్యా డ్యామ్‌కు ఎగువన, దిగువన 300 మీటర్ల పరిధిలో ఇసుక తవ్వకాలు పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. ఈ నిబంధనలను అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని ఇసుక రీచ్‌లను ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్, టీజీఎండీసీ శాఖలు సమన్వయంతో తరచుగా తనిఖీ చేయాలని సూచించారు. 'మన ఇసుక వాహనం' ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పారదర్శకంగా ఇసుక కేటాయింపులు జరగాలని తెలిపారు. ఈ సమావేశంలో గ్రౌండ్ వాటర్ డీడీ శ్యాంప్రసాద్ నాయక్, డీపీఓ జగదీశ్వర్, జిల్లా జియాలజిస్ట్ ప్రసన్న, మైన్స్ ఏడీ రాఘవరెడ్డి, టీజీఎండీసీ పీడీ శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# కొమ్మాలగుట్ట ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ

గీసుగొండ మండలం కొమ్మాలగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఫిబ్రవరి 23 నుంచి మార్చి 09 వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా, అటవీ, పర్యావరణ, దేవాదాయధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకి బ్రహ్మోత్సవాలకు హాజరుకావలసిందిగా అధికారిక ఆహ్వానం అందజేశారు. ఈ మేరకు ఆలయ అర్చకులు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అర్చకులు మంత్రికి వేద ఆశీర్వచనం చేసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, కొమ్మాలగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని, భక్తులకు అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బ్రహ్మోత్సవాలు భక్తుల సహకారంతో ఘనంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.

# నూతన నర్సరీ పనులను ప్రారంభించిన సర్పంచ్ రమేష్ రాథోడ్

**వేద న్యూస్, నెక్కొండ :**



బంజరు పల్లె గ్రామంలో నూతనంగా నర్సరీ మొక్కల పెంపకాన్ని సర్పంచ్ రమేష్ రాథోడ్ ప్రారంభించడం జరిగింది.పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అన్న నినాదంతో ఊరంతా మొక్కలను నాటే పెంచే మహా వృక్షాలుగా చేయడమే ఉద్దేశ్యంగా నర్సరీని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర సుజాత రాజు, వార్డ్ మెంబర్లు మౌనిక రాజు రాథోడ్, మహేశ్వరి రాజు జనగాం వెంకటేశ్వర్లు తీర్నల్, మిట్టు భీమన్న, కృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్, టిఎ సురేందర్ కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

వేద న్యూస్

గురువారం ఫిబ్రవరి 19, 2026

# ఉచిత కంటి పరీక్షల శిబిరం

**- ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో పరీక్షలు**

**వేద న్యూస్, వీర్నపల్లి:**



వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామంలో సర్పంచ్ రాకేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సిబ్బంది గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించి, అవసరమైన వారికి చికిత్స సూచనలు అందించారు. శస్త్రచికిత్స అవసరమైన రోగులను ప్రత్యేక వాహ ఓనం ద్వారా ఆసుపత్రికి తరలించి ఆపరేషన్ చేసి తిరిగి వారి గ్రామాలకు చేర్చనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినందుకు సర్పంచ్, ఆసుపత్రి సిబ్బందికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ

**వేద న్యూస్, నర్సంపేట :**



నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని మహేశ్వరంలో గల జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మోతే సమ్మిరెడ్డి పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేశారు.సభాధ్యక్షులు ప్రధానోపాధ్యాయులు స్వరూప మాట్లాడుతూ విద్యార్థులు స్టడీ మెటీరియల్ బాగా ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పిల్లలు బాగా చదివి మంచి మార్కులు తీసుకొచ్చుకోవాలని ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడాలని సూచించారు.ఈనాటి కార్యక్రమంలో నర్సంపేట మున్సిపల్ చైర్మన్ శ్రీ లక్ష్మీ రామానంద్ విద్యార్థులు బాగా కష్టపడి చదివి మంచి పేరు తీసుకురావాలని కోరారు. పెండెం రామానంద్ ఎల్లవేళలా మేము మీకు విద్యార్థుల కు సహకరిస్తాము అన్నారు. వైస్ చైర్మన్ గంధం నరేందర్ కౌన్సిలర్లు,బుస శిరీష రాజు, భూక్య మాతృ రాథోడ్, ఏపూరి శ్రీనివాసరెడ్డి మాదాసి రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరందరికీ లయన్స్ క్లబ్, పాఠశాల యాజమాన్యం సన్మానం చేశారు. లైన్స్ క్లబ్ సెక్రటరీ ఇంద్రసేనారెడ్డి, కోశాధికారి ఎండి యాకూబ్, గీతాంజలి ఫౌండర్ శ్రీ సుబ్బా రెడ్డి, కాకతీయ గురుకుల ఫౌండర్, కమలాకర్, రాజిరెడ్డి ,కాకతీయ ప్రిన్సిపల్ మాధవ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు అర్జునసాగర్, వేణుబాబు ,శ్రీలత,రాజేశ్వరి మేడం రమేష్, శ్రీలత, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం సరిత బాయ్, సారంగపాణి పాల్గొన్నారు.

# బాల్యాన్ని చిదిమేస్తే చట్టం ఊరుకోదు

**- బాల్యవివాహాలు, పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన**

**వేద న్యూస్, కరీంనగర్:**




బాలల హక్కులను ఉల్లంఘించే చర్యలపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ప్రతినిధులు తెలిపారు. మానకొండూరులోని పీఎంశ్రీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' కార్యక్రమం భాగంగా న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. బాల్య వివాహ నిషేధ చట్టం-2006, పోక్సో చట్టం వంటి నిబంధనల ద్వారా బాలల హక్కులకు రక్షణ కల్పించబడుతుందని వివరించారు. బాల కార్మిక వ్యవస్థ, మానవ అక్రమ రవాణా, మాదకద్రవ్యాల ముప్పు నుంచి దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఆర్థికంగా బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పెరుక రంగయ్య పటేల్, చిట్టి చంద్రప్రకాష్ రెడ్డి, కిరణ్ కుమార్, శాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు దాసి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రిటైర్మెంట్ బెనిఫిట్స్ తక్షణం చెల్లించాలి

**- టాప్రా ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద పెన్షనర్ల ధర్నా**

**వేద న్యూస్, కరీంనగర్:**



పెండింగ్‌లో ఉన్న రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను వెంటనే ఒకేసారి విడుదల చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్రా) రాష్ట్ర శాఖ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టాప్రా కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మార్చి 2024 నుంచి పదవీ విరమణ పొందిన పలువురికి ఇప్పటికీ బెనిఫిట్స్ అందలేదని తెలిపారు. దశలవారీ చెల్లింపులు కాకుండా అన్ని బకాయిలను ఒకేసారి చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం అశోక్ మాట్లాడుతూ పెండింగ్ డీఏలు విడుదల చేసి, నూతన పీఆర్సీని వెంటనే అమలు చేయాలని కోరారు. గౌరవాధ్యక్షుడు కట్ట నాగభూషణాచారి పెన్షనర్లకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్య సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ధర్నాలో జిల్లా, మండల స్థాయి టాప్రా నాయకులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా బీసీలకు అవకాశం ఇవ్వాలి

**- మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావుకు బీసీ జేఏసీ విజ్ఞప్తి**

**వేద న్యూస్, దామరచర్ల:**

మిర్యాలగూడ మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ పదవిని బీసీలకు కేటాయించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ కోరారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీకి, మాజీ ఎమ్మెల్యే ఎన్. భాస్కర్ రావుకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. బుధవారం మిర్యాలగూడలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు సామాజిక న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల్లో బీసీలకు అవకాశం ఇవ్వలేదని, కనీసం ఫ్లోర్ లీడర్ పదవిని బీసీలకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, యర్రబెల్లి దుర్గయ్య, ధోనేటి శేఖర్, మల్లికంటి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల ఆత్మహత్యలు ఆందోళనకరం

**- ఏఐఎస్‌బీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు రవీందర్ గౌడ్**

**- గురుకులాల్లో సైకాలజిస్టుల నియామకానికి డిమాండ్**

**వేద న్యూస్, ఉమ్మడి నిజామాబాద్:**



తెలంగాణలో గురుకుల, సంక్షేమ, కేజీబీవీ హాస్టళ్లలో విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని ఏఐఎస్‌బి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు బైరాపూర్ రవీందర్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టళ్ల నిర్వహణలో పర్యవేక్షణ లోపం కనిపిస్తోందని విమర్శించారు. ప్రతి గురుకుల, సంక్షేమ, కేజీబీవీ హాస్టళ్లలో విద్యార్థులకు అనుకూల వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల్లో మానసిక ధైర్యం పెంపొందించేందుకు వెంటనే సైకాలజిస్టులను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులు ఒత్తిడిని తట్టుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పరీక్షల సమయంలో తల్లిదండ్రులు కూడా పిల్లలపై అధిక ఒత్తిడి తీసుకురాకూడదని విజ్ఞప్తి చేశారు.

# ప్రతి పైసా ప్రజా సంక్షేమం కోసమే

**- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జవ్వాజి హరీష్**

**- సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ**



**వేద న్యూస్, రామడుగు:**

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ప్రతి పైసాను ప్రజా సంక్షేమం కోసం ఖర్చు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జవ్వాజి హరీష్ అన్నారు. సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి సీఎంఆర్ఎఫ్ పథకం ఆర్థిక భరోసా కల్పిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు బొమ్మరవెని తిరుపతి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనుపురం పర్శరాములు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జవ్వాజి అజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట గ్రామానికి చెందిన మెరగుత్తి కిరణ్ ఈ నెల 9న అనారోగ్యంతో మృతి చెందగా, విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ చింతల ఉమా రవిపాల్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. దశదిన కర్మకు రూ. 5 వేల ఆర్థిక సహాయం అందించి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కిరణ్ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డు సభ్యుడు దైనంపల్లి సుమన్, గట్టు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# శివాజీ విగ్రహంపై రాజకీయ వివాదం

**- హామీ ఇచ్చి వెనక్కి తగ్గారని సర్పంచ్‌పై ఆరోపణలు**

**వేద న్యూస్, కరీంనగర్:**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఓ గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటు అంశం రాజకీయ వివాదానికి దారితీసింది. ఎన్నికల సమయంలో విగ్రహం ఏర్పాటు చేసి ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చిన సర్పంచ్ అభ్యర్థి, గెలిచిన తర్వాత వెనక్కి తగ్గారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. శివాజీ జయంతి సమీపిస్తున్న నేపథ్యంలో విగ్రహ ప్రతిష్టాపనకు సహకరించకపోగా, అడ్డంకులు సృష్టిస్తున్నారని గ్రామ యువత విమర్శిస్తున్నారు. కొందరిని ప్రేరేపించి అధికారులకు ఫిర్యాదులు చేయిస్తున్నారని ఆరోపించారు. దీంతో గ్రామ యువకులు, పెద్దలు స్వచ్ఛందంగా చందాలు సేకరించి విగ్రహాన్ని కొనుగోలు చేశారు. ఓ దాత తన సొంత స్థలాన్ని విగ్రహ ప్రతిష్టాపనకు ఇచ్చినప్పటికీ, అక్కడ కూడా ఒత్తిళ్లు కొనసాగుతున్నాయని తెలిపారు. గ్రామ పెద్దలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి హెచ్చరికలు ఇవ్వడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, విగ్రహ ప్రతిష్టాపన విషయంలో అధికారులు తటస్థంగా వ్యవహరించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



# గెలుపొందిన మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లకు సన్మానం

**వేద న్యూస్, వర్ధన్నపేట:**



హనుమకొండ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన వర్ధన్నపేట మున్సిపాలిటీ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, కౌన్సిలర్లను ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగరాజు శాలువా కప్పి, పూల బొకేలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుని అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కందుకూరి పూర్ణచందర్, వస్కుల శంకర్, వస్కుల నాగరాజు, జక్కుల సదానందం, యూత్ కాంగ్రెస్ నాయకులు లింగాల రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లకు సన్మానం



**వేద న్యూస్, దామరచర్ల:**


మిర్యాలగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష్ నవీన్‌లను బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ మాట్లాడుతూ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. మిర్యాలగూడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పొదిలే శ్రీనివాస్, మౌలాల అమృత దంపతులు, వార్డు ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు, బీఎల్ఆర్ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# జనావాసాల్లో పందుల స్వైర విహారం

- పారిశుధ్యంపై ప్రజల ఆగ్రహం
- చెత్త కుప్పలతో పెరుగుతున్న పందుల బెడద
- తక్షణం చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి

**వేద న్యూస్, శంకరపట్నం:**

శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామపంచాయతీ పరిధిలోని మొదటి, రెండో వార్డుల్లో పారిశుద్ధ్య లోపంతో పందుల బెడద తీవ్రంగా పెరిగిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇండ్ల పరిసరాల్లో ప్లాస్టిక్, చెత్త చెదారం ఎక్కడపడితే అక్కడ పేరుకుపోవడంతో పందులు స్వైర విహారం చేస్తున్నాయని తెలిపారు. చెత్త కుప్పల కారణంగా దుర్వాసనతో పాటు ఈగలు, దోమలు పెరిగి ప్రజలు అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ అధికారులు, పాలకవర్గం పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. చెత్త సేకరణ కోసం ట్రాక్టర్‌ను క్రమం తప్పకుండా తిప్పడం లేదని, వ్యర్థాలను డంపింగ్ యార్డ్‌కు తరలించే



చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో చెత్త కుప్పలు పేరుకుపోకుండా చర్యలు తీసుకుని పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని, పందుల బెడద నుంచి ప్రజలను రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



- మెడపై గాయాలపై బంధువుల అనుమానం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**వేద న్యూస్, వేములవాడ:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం సంచలనంగా మారింది. కోరుట్ల బస్ స్టాండ్ సమీపంలో నివాసం ఉంటున్న వెంగల రోహిణి (32) బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు సమాచారం. కథలాపూర్ మండలానికి చెందిన రోహిణికి ఎనిమిదేళ్ల క్రితం దినేష్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య విభేదాలు ఉన్నట్లు తెలుస్తోంది. వివాహేతర సంబంధం అంశంపై తరచూ గొడవలు జరిగేవని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున రోహిణి ఆత్మహత్య చేసుకుందని చెప్పుతూ కుటుంబ సభ్యులు ఆమెను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే మెడపై గాయాలు ఉండటంతో బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న టౌన్ సీఐ వీర ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## బాలుడితో బిక్షాటన.. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

**వేద న్యూస్, వేములవాడ:**



వేములవాడ ఎగ్జిబిషన్ వద్ద భిక్షాటన చేస్తున్న బాలుడిని జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాల మేరకు జిల్లా సంక్షేమ శాఖ అధికారులు గుర్తించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరు పరిచారు. మంగళవారం రాత్రి గాంధీజీ వేషధారణలో ఓ బాలుడు భిక్షాటన చేస్తున్నట్లు చైల్డ్ హెల్ప్ లైన్‌కు సమాచారం అందడంతో జిల్లా సంక్షేమ అధికారి పి. లక్ష్మీరాజం ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య, చైల్డ్ హెల్ప్ లైన్ బృందాలు వెంటనే స్పందించాయి. బాలుడిని రెస్క్యూ చేసి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. బాలుడిని పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించిన అధికారులు, మరోసారి భిక్షాటనకు పంపితే జువైనల్ జస్టిస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# సీఎం కప్ రాష్ట్రస్థాయికి వెంకట్రావుపల్లి విద్యార్థిని ఎంపిక

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం జెడ్పీహెచ్ఎస్ వెంకట్రావుపల్లి పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని ఎన్. శివ కీర్తన సీఎం కప్ క్రీడల్లో 600 మీటర్ల పరుగు పందెంలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ప్రతాప్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభ కనబర్చి మరిన్ని విజయాలు సాధించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తారకాదేవి, అరుణశ్రీ, జి. నర్సయ్య, కె. పద్మ, కె. శైలజ, వనజాదేవి తదితరులు పాల్గొని విద్యార్థినిని అభినందించారు.



# డ్రంక్ అండ్ డ్రైవ్‌పై తనిఖీలు

**వేద న్యూస్, బోయినిపల్లి:**




రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో పోలీసులు బుధవారం సాయంత్రం డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో వాహనదారుల ధ్రువపత్రాలను పరిశీలించి, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచిస్తూ, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రమాకాంత్ హెచ్చరించారు. ప్రజలు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కనుకయ్య, బుమయ్య, బ్లూకోట్ సిబ్బంది రమేష్, తిరుపతి తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జేఈఈ మెయిన్స్‌లో సైనిక్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

- ఏడుగురు విద్యార్థులు అడ్వాన్స్‌కు అర్హత

**వేద న్యూస్, చొప్పదండి:**

జేఈఈ మెయిన్స్-2026 ఫలితాల్లో సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ పాఠశాల/కళాశాల, రుక్మాపూర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కళాశాలకు చెందిన 48 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, అందులో ఏడుగురు జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారు. ఈ విద్యార్థులకు ఐఐటీ, ఎన్ఐటీ, జీఎఫ్టీఐ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశం పొందే అవకాశం ఉంది. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ కర్నల్ రాజా దత్త, ప్రిన్సిపాల్ వి. లింగయ్య, అధ్యాపకులు శ్రీనివాస్, దేవేందర్, సతీష్, అనిల్ కుమార్, అశోక్, శ్రీధర్ తదితరులు అభినందించారు.




# నూతన కౌన్సిలర్ కు సన్మానం

**వేద న్యూస్, చొప్పదండి:**



చొప్పదండి పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తిని సంపత్ గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిలర్‌గా భారీ మెజార్టీతో గెలుపొందిన కొత్త సుమలత గంగారెడ్డిని పార్టీ నాయకులు ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతిపక్షంగా నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆరెల్లి చంద్రశేఖర్ గౌడ్, కొత్తూరి మహేష్, ఎం.డి. అజ్జు, మంద నర్సయ్య, లోక రాజేశ్వర్ రెడ్డి, వెల్మ నాగిరెడ్డి, సీపెల్లి గంగయ్య, ఎం.డి. జహీరొద్దిన్, కొక్కుల రామ్మోహన్, గుండేటి రాజారమేష్, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అక్రిడేషన్ కమిటీ సభ్యుడిగా వెంకట స్వామి



**వేద న్యూస్, మంచిర్యాల:**

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) యూనియన్ తరపున అక్రిడేషన్ కమిటీ సభ్యుడిగా కామెర వెంకట స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి మధు, కార్యదర్శి సత్య గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో యూనియన్ సభ్యులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి మధు మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన వెంకట స్వామి తన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించి జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. యూనియన్ సభ్యులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చానకొండ శ్రీనాథ్, చెన్నూరు ఇన్‌చార్జి మడ్డి వేణుగోపాల్ గౌడ్, సతీష్, సందీప్, సురేందర్, సురేష్, నరసయ్య, నెల్లూరి శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**వేద న్యూస్, కారేపల్లి:**

మండలంలోని విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన మెట్టెల రవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని నాయకులు పరామర్శించారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆదేశాల మేరకు మాజీ సర్పంచ్ అజ్మీరా కాంతి తనయుడు అజ్మీరా నరన్ మృతుడి కుటుంబానికి రూ. 3 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేస్తూ, ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అజ్మీరా హేమ్లా, మీరా సాహెబ్, హమాలీ మేస్త్రి తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

గురువారం ఫిబ్రవరి 19, 2026

# గ్రామాభివృద్ధికి కృషి చేస్తా



- సర్పంచ్ లింగంపేట పావని

**వేద న్యూస్, పాపన్నపేట:**

పాపన్నపేట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ లింగంపేట పావని ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో త్రాగునీటి సరఫరా, పారిశుధ్యం, వీధి దీపాలు మరియు ఇతర గ్రామాభివృద్ధి అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. గ్రామ అభివృద్ధికి సమగ్రంగా కృషి చేస్తామని సర్పంచ్ పావని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వ్యక్తిపై కేసు నమోదు

- జరిమానా, ఆరు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు

**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల పరిధిలో పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో మద్యం సేవించి కారు నడిపిన వ్యక్తిని పట్టుకున్నారు. నందిపేట్ మండలం చీమరాజుపల్లి గ్రామానికి చెందిన గుమ్మల దేవేందర్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. గురువారం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, మేజిస్ట్రేట్ శేషతల్ప సాయి రూ.10 వేల జరిమానా విధించి, అతని డ్రైవింగ్ లైసెన్స్‌ను ఆరు నెలల పాటు రద్దు చేసినట్లు వెల్లడించారు.

# మల్లంపేట్‌లో ట్రైనీ గ్రూప్-1 అధికారుల పర్యటన

- మహిళా సంఘాలు, ఉపాధి హామీ పథకాలపై పరిశీలన

**వేద న్యూస్, పాపన్నపేట:**

పాపన్నపేట మండలం మల్లంపేట్ గ్రామంలో ట్రైనీ గ్రూప్-1 అధికారులు పర్యటించారు. గ్రామ పరిపాలన, గ్రామపంచాయతీ విధానం, మహిళా సంఘాల కార్యకలాపాలు, పొదుపు పథకాలు, ఉపాధి హామీ అమలు తదితర అంశాలను పరిశీలించారు. అలాగే గ్రామ ఆర్థిక వనరులు, ప్రజా సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకుని సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ గ్రూప్-1 అధికారులు విజయ్ కుమార్, ప్రియాంజలి, ఆంజనేయులు, శంతన్ కుమార్ రెడ్డి, ఫహీమిన్ ఫైజ్, సాయి కమల్ తదితరులు పాల్గొన్నారు.



# పీఏడీ సమస్యకు ఆధునిక వైద్యం




- కోత లేకుండా నిడిల్ పంక్చర్ ద్వారా చికిత్స
- ఆలస్యం చేస్తే కాళ్లు కోల్పోయే ప్రమాదం
- హైటెక్ సిటీ యశోద డాక్టర్ శ్రీకాంత్ రాజు

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

హైటెక్ సిటీ యశోద హాస్పిటల్‌లో పెరిఫెరల్ ఆర్టీరియల్ డిసీజ్ (పీఏడీ) సమస్యతో బాధపడుతున్న రోగులకు ఎండోవాస్క్యులర్ టెక్నిక్ ద్వారా ఆధునిక వైద్యం అందిస్తున్నామని వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ శ్రీకాంత్ రాజు తెలిపారు. ఖమ్మం యశోద హాస్పిటల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ చికిత్సను నిడిల్ పంచర్ ద్వారా ఎటువంటి కోత లేకుండా, మత్తుమందు అవసరం లేకుండా నిర్వహిస్తారని తెలిపారు. చికిత్స అనంతరం రోగులు త్వరగా కోలుకుని సాధారణ పనులు కొనసాగించవచ్చన్నారు. నడిచేటప్పుడు కాళ్లలో నొప్పి, పాదాల్లో మానని గాయాలు, కాళ్లు నల్లబడడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వాస్క్యులర్ సర్జన్‌ను సంప్రదించాలని సూచించారు. ముఖ్యంగా మధుమేహం, ధూమపానం, మద్యపానం, ఊబకాయం ఉన్నవారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుందని తెలిపారు. సమయానికి చికిత్స తీసుకోకపోతే కాళ్లు తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చని హెచ్చరించారు. ఆధునిక సదుపాయాలతో ప్రతి నెల 100–150 మంది రోగులకు విజయవంతంగా చికిత్స అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ బాలరాజు, టీం లీడర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు..

# ఏడుపాయల హుండీ ఆదాయం రూ.39.87 లక్షలు

- 29 రోజుల్లో భారీగా సమకూరిన భక్తుల కానుకలు

**వేద న్యూస్, పాపన్నపేట:**

ఏడుపాయల వనదుర్గ భవాని దేవి ఆలయంలో 29 రోజుల హుండీ ఆదాయం రూ.39,87,178 వచ్చినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ స్పెషల్ ఆఫీసర్, సహాయ కమిషనర్ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం గోకుల్ షెడ్‌లో శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ లెక్కింపును దేవాదాయ శాఖ అధికారులు పర్యవేక్షించారు. అదనంగా ఒడి బియ్యం ద్వారా రూ.69,200, కేశఖండన ద్వారా రూ.56,600, ప్రత్యేక దర్శనం ద్వారా రూ.3,59,420, లడ్డూ విక్రయాల ద్వారా రూ.22,48,640, పులిహోర ద్వారా రూ.1,25,630 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి వీరేశం తెలిపారు. మొత్తం ఆదాయం రూ.87,56,268కు చేరినట్లు పేర్కొన్నారు. ఈ



కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అన్నమాచార్య సేవా ట్రస్ట్ సభ్యులు పాల్గొనగా, పాపన్నపేట పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# జైలు జీవితం శిక్ష కాదు.. శిక్షణ - అంబటి రాంబాబు



**వేద న్యూస్ అమరావతి:**

రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి పద్దెనిమిది రోజుల తర్వాత బెయిల్‌పై విడుదలైన వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జైలు జీవితం తనలో మరింత పట్టుదలను నింపిందని, దాన్ని శిక్షగా కాకుండా శిక్షణగా భావించానని తెలిపారు. బాత్రూంలో జారిపడిన సంఘటన మినహా ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని పేర్కొన్నారు. జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే మీడియాతో మాట్లాడిన ఆయన, కూటమి ప్రభుత్వంపై తన పోరాటం ఇకపై రెట్టింపు ఉత్సాహంతో కొనసాగుతుందని స్పష్టం చేశారు. తనను జైలులో ఉంచితే భయపడతానని కొందరు భావించి ఉండవచ్చని, కానీ తాను ఎవరికీ భయపడే ప్రసక్తే లేదన్నారు. కాలం తిరిగి వస్తుందని, అన్యాయాలకు తగిన సమాధానం లభిస్తుందని వ్యాఖ్యానించారు. తన ఇంటిపై జరిగిన దాడి వెనుక ప్రభుత్వం ఉన్నదని ఆరోపించారు. దుండగులు గంటల తరబడి దాడి చేసినప్పటికీ పోలీసులు అక్కడే ఉన్నారని, తమ రక్షణలోనే దాడి జరిగిందని విమర్శించారు. దాడి చేసిన వారికి తక్షణమే బెయిల్ లభించిందని, తనకు మాత్రం పద్దెనిమిది రోజుల తర్వాత బెయిల్ రావడం అన్యాయమని అన్నారు. జైల్లో సాధారణ ఖైదీగానే ఉన్నానని, ప్రత్యేక సౌకర్యాలు కోరలేదని తెలిపారు. జైల్లో అందించిన భోజనమే తీసుకున్నానని, ఆరోగ్యంగా ఉన్నానని చెప్పారు. తన రాజకీయ ప్రస్థానం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలోనే కొనసాగుతుందని, వెనకడుగు వేయనని పునరుద్ఘాటించారు. రాష్ట్ర పరిస్థితులపై పూర్తి సమాచారం సేకరించిన తర్వాత గుంటూరులో విలేకరుల సమావేశంలో సమగ్రంగా మాట్లాడతానని వెల్లడించారు.

# కత్తితో పొడిచి మహిళ హత్య

**వేద న్యూస్ హైదరాబాద్ :**

వనస్థలిపురం పోలీసు స్టేషన్ పరిధిలోని గ్రీన్ సిటీ కాలనీలో దారుణం చోటుచేసుకుంది. ఓ మహిళను కత్తులతో మాజీ కిరాతకంగా పొట్టనపెట్టుకున్నాడు. వనస్థిలిపురంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న వివాహితను మహేష్ అనే వ్యక్తి కత్తితో పొడిచి చంపాడు. అడ్డుకునేందుకు వెళ్లిన స్థానికులను పెట్రోల్ పోసి అంటిస్తానని బెదిరించాడు.సదరు మహిళతో తనకు గతంలో పెళ్లి అయిందని, తను ఇప్పుడు రెండో పెళ్లి చేసుకుంది అని మహేష్ పోలీసులకు తెలిపినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## స్వరాజ్య సంకల్పానికి జీవం పోసిన
# మహా వీరుడు ఛత్రపతి శివాజీ

- పరాక్రమం, వ్యూహపటిమ, ప్రజాసంక్షేమ దృష్టికి ప్రతీక
- ధర్మ పరిరక్షణ, మహిళా గౌరవానికి కట్టుబాటు
- నాయకత్వం అంటే నైతికత, దూరదృష్టి అని నిరూపించిన చరిత్రపురుషుడు

**వేద న్యూస్ డెస్క్:**



భారత చరిత్రలో స్వరాజ్యానికి పునాది వేసిన మహనీయుల్లో ఛత్రపతి శివాజీ మహారాజ్ అగ్రస్థానంలో నిలుస్తారు. పరాక్రమం, ధైర్యం, తెలివితేటలు, పరిపాలనా దక్షత గుణాల సమాహారంగా ఆయన వ్యక్తిత్వం వెలుగొందింది. ఆయన జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా ఆయన స్ఫూర్తిదాయక జీవితం, నాయకత్వ విలువలు, దేశభక్తి భావం మరోసారి చర్చకు వస్తున్నాయి. శివాజీ మహారాజ్ కేవలం ఒక రాజు మాత్రమే కాదు; ఒక ఆలోచన, ఒక ఉద్యమం, ఒక స్వాభిమాన ప్రతీక. శివాజీ మహారాజ్ జీవిత గాథ ఒక సాహసకథ. శత్రువులతో నిండిన రాజకీయ వాతావరణంలో స్వరాజ్యాన్ని స్థాపించాలనే ధృఢసంకల్పంతో ఆయన ముందుకు సాగారు. కోటల నిర్మాణం, సమర్థ సైనిక వ్యవస్థ, ఆకస్మిక దాడుల వ్యూహాలు ఆయన యుద్ధపటిమను ప్రతిబింబించాయి.

పరిమిత వనరులతోనూ అసాధారణ విజయాలను సాధించడం ఆయన నాయకత్వానికి నిదర్శనం. యుద్ధంలో మాత్రమే కాదు, రాజకీయ సమీకరణాల్లోనూ ఆయన తెలివితేటలు స్పష్టంగా కనిపించాయి. అయితే శివాజీ మహారాజ్ కేవలం యోధుడిగానే పరిమితం కాలేదు. ప్రజల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్న పరిపాలకుడిగా కూడా ఆయన గుర్తింపు పొందారు. రైతులకు రక్షణ, పన్నుల వ్యవస్థలో క్రమశిక్షణ, న్యాయబద్ధ పరిపాలన వంటి అంశాలకు ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. ముఖ్యంగా మహిళల గౌరవానికి ఆయన కట్టుబాటు చరిత్రలో ప్రత్యేకంగా నిలిచింది.

శత్రు ప్రాంతాల్లోనూ మహిళలను గౌరవించాలనే ఆదేశాలు ఆయన నైతిక విలువలను చూపించాయి. మత సామరస్యానికి ఆయన ఇచ్చిన ప్రాధాన్యం కూడా విశేషం. తన రాజ్యంలో వివిధ మతాల ప్రజలు సమానంగా జీవించేలా పరిపాలన సాగించారు. ధర్మ పరిరక్షణ ఆయనకు ముఖ్యమైనప్పటికీ, అది ఇతర మతాలపై వివక్షకు దారి తీసేలా కాకుండా సమతుల దృక్పథంతో కొనసాగింది. ఈ విశాల దృష్టి ఆయనను గొప్ప నాయకుడిగా నిలబెట్టింది. శివాజీ మహారాజ్ నాయకత్వంలో ఉన్న మరో విశేషం దూరదృష్టి. పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు మార్చుకోవడం, సమయానికి నిర్ణయాలు తీసుకోవడం, శక్తివంతమైన శత్రువుల మధ్యనూ తన స్థానం నిలబెట్టుకోవడం ఆయన రాజకీయ పటిమను చాటాయి.

నాయకత్వం అంటే కేవలం అధికారంలో ఉండడం కాదు; ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడం అని ఆయన జీవితం తెలియజేస్తుంది. నేటి సమాజంలో ఆయన స్ఫూర్తి మరింత అవసరం. స్వాభిమానం, ధైర్యం, నైతికత, బాధ్యతాయుత పరిపాలన ఇవి ప్రతి నాయకుడి లక్షణాలు కావాలి. శివాజీ మహారాజ్ చూపిన మార్గం కేవలం చరిత్రలోనే కాదు, నేటి ప్రజాస్వామ్య వ్యవస్థలోనూ మార్గదర్శకంగా నిలుస్తుంది. ప్రజల కోసం పనిచేయడం, న్యాయబద్ధంగా పరిపాలించడం, విభిన్న వర్గాలను ఐక్యం చేయడం ఇవే నిజమైన నాయకత్వ లక్షణాలు.శివాజీ మహారాజ్ జీవితం మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తుంది. ప్రతికూల పరిస్థితుల్లోనూ ధైర్యం కోల్పోకూడదు. స్వరాజ్యం అనేది కేవలం భూభాగం కాదు; అది ప్రజల గౌరవం, ఆత్మగౌరవం. ఆ గౌరవాన్ని కాపాడేందుకు కట్టుబడి ఉండాలి.

నాయకత్వం అంటే నైతికతతో కూడిన బాధ్యత. మొత్తంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి కేవలం ఒక చారిత్రక స్మరణ కాదు. అది స్వరాజ్య స్ఫూర్తిని మళ్లీ మేల్కొలిపే రోజు. దేశభక్తి, ధైర్యం, ప్రజాసంక్షేమ పరిపాలనకు ప్రేరణనిచ్చే సందర్భం.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073